క్లుప్తంగా

100 రోజుల పనిదినాలు కల్పించాలి



సీతయ్యపేట గ్రామంలో వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీఓ జనార్ధనరావు

బొబ్బిలి రూరల్: వేతనదారులందరికీ 100 రోజుల పనిదినాలు కల్పించాలని ఏపీఓ వై.జనార్ధనరావు సూచించారు. శుక్రవారం మండలంలోని సీతయ్యపేట, దిబ్బగుడ్డివలస, గోపాలరాయుడిపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన వేతనదారుల మస్తర్లు పరిశీలించారు. పనిలోకి వచ్చిన వారికే మాత్రమే మస్తర్లు వేయాలని, జాబ్‌కార్డు ఉన్న వారినే పనిలోకి అనుమతించాలన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ



పరీక్షా సామగ్రిని చూపుతున్న విద్యార్థులతో వాసవీక్లబ్ సభ్యులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి సారధి బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు వాసవీ క్లబ్ మనరాజాం–సారధి సభ్యులు శుక్రవారం పరీక్షా సామగ్రి అందజేశారు. త్వరలో జరగనున్న పరీక్షలను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో చదువుతున్న 65 మందికి అట్టలు, పెన్సిళ్లు, పెన్నులు, స్కేలు, హాల్‌టికెట్ కవర్లను పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని, పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ సభ్యులు వాకచర్ల రాజ, గ్రంధి రవి కుమార్, అంబరీసు, వనితాకాంతి కిట్టి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల నివారణకు 'డ్రై డే'



తెర్లాంలో మురుగు కాలువను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు

తెర్లాం: దోమల నివారణకు డ్రై డే కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందని తెర్లాం పీహెచ్‌సీ సీహెచ్‌ఓ భాస్కరరావు తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల పరిసరాలు, మురుగు కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో నీటి నిల్వలు లేకుండా చేశారు. డ్రమ్ములు, ఖాళీ పాత్రలు, ప్లాస్టిక్ సీసాలు, కొబ్బరి బోండాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, తద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని వైద్య సిబ్బంది తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సింహాచలం

తెర్లాం: మండలంలోని మాధంబట్లవలస గ్రామంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఎంపీటీసీ చింత సింహాచలం ఆయా నిర్మాణాల పనులు ప్రారంభించగా, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

నాడు–నేడు పనులపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఈ జగ్గారావు

రామభద్రపురం: మనబడి నాడు–నేడు పనుల్లో పురోగతి పెంచాలని డీఈ జగ్గారావు సూచించారు. స్థానిక ఎంఆర్‌సీ భవనంలో ఎంఈఓ తిరుమలప్రసాద్‌తో కలిసి మండలంలో మనబడి నేడు–నేడు పథకంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి, పాఠశాలలను అభివృద్ధి చేస్తోందన్నారు. ఆయా పనుల్లో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

20న వాహనాల వేలం

రాజాం సిటీ: ఈ నెల 20న స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయం వద్ద ద్విచక్రవాహనాల వేలం నిర్వహించనున్నామని సీఐ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ కేసులో సీజ్ చేసిన నాలుగు వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 9 గంటలకు వేలంలో పాల్గొనాలని సూచించారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



రాజాం: చిరుధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ



సంతకవిటి: ర్యాలీలో అధికారులు, తదితరులు



వంగర: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



రామభద్రపురంలో రైతు ఉత్పత్తిదారు సంఘ సభ్యులు



బాడంగి: కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, మహిళలు, రైతులు



రేగిడి: ర్యాలీ చేస్తున్న అధికారులు

రాజాం: చిరుధాన్యాల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని వైకేపీ రాజాం ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి అన్నారు. స్థానిక ఎంఎంఎస్ కార్యాలయం వద్ద మహిళా సంఘాల సభ్యులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. మెట్టు ప్రాంతాల్లో కూడా వీటిని సాగు చేయొచ్చన్నారు. వీటిలో ఉన్న పోషక విలువలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఏపీఎంలు కె.హేమలత, దధికుమార్‌లు, ఎంఎంఎస్ అధ్యక్షులు సామంతుల అరుణ, రైతు ఉత్పత్తి సంఘాల అధ్యక్షులు నీలవేణి, మహిళా రైతులు పాల్గొన్నారు.

రేగిడి: చిరుధాన్యాల సాగు రైతులకు లాభదాయకమని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు అన్నారు. మండల కేంద్రంలో వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉందని, తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం టి.మంగమ్మ పాల్గొన్నారు.

సంతకవిటి: స్థానిక వెలుగు కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారు సంఘాల్లోని రైతులకు చిరుధాన్యాల పంటల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. చిరుధాన్యాల ఆవశ్యకతను ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి వివరించారు. అనంతరం రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం డి.సీతారాం, మండల సమాఖ్య అధ్యక్షులు సుశీల, సీసీ శ్రీనివాసరావు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

వంగర: మండల కేంద్రంలో తహసీల్దార్ డి.ఐజాక్ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు చిరుధాన్యాల సాగుపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు, ఏపీఎంలు మీసాల చక్రపాణి, గోవిందరావు, ఎఫ్‌పీఓ అధ్యక్షులు గంటా రామ్మోహన్‌నాయుడు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

రామభద్రపురం: చిరుధాన్యాలు తినడం వల్ల మంచి ఆరోగ్యం లభిస్తుందని ఏపీఎం జి.వెంకటరమణ తెలిపారు. అంతర్జాతీయ చిరుధ్యానాల మహోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక వెలుగు కార్యాలయ సిబ్బంది, వీఓఏలు, రైతు ఉత్పత్తిదారు సంఘ సభ్యులు, డ్వాక్రా సంఘ సభ్యులంతా కలిసి చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీపై విత్తనాలు ఇవ్వడంతో పాటు సాగుపై శిక్షణ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ ఏపీఎం రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవం సందర్భంగా స్థానిక మండల సమాఖ్య కార్యాలయం వద్ద చిరుధాన్యాల సాగు, వాటి వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అక్కారావు మాట్లాడుతూ చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలన్నారు. చిరుధాన్యాలు తినడం వల్ల మెరుగైన ఆరోగ్యం సాధించవచ్చన్నారు. రక్తపోటు, మధుమేహంతో బాధపడేవారంతా చిరుధాన్యాలు తింటే మంచి ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ద్రవజీవామృతంతో పంటలకు మేలు



పొలంలో బీజామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ డివిజన్ కో–ఆర్డినేటర్ లక్ష్మి

బాడంగి: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వాడే ద్రవజీవామృతం పంటలకు మేలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వై.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని గొల్లాది, కోడూరు గ్రామంలో ద్రవజీవామృతం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఆసక్తి చూపాలన్నారు. రసాయన ఎరువులకు బదులు ద్రవజీవామృతం పంటలకు వినియోగించడం వల్ల ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. నేల కూడా సారవంతమవుతుందన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.పణుకువలస గ్రామంలో బీజామృతం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి, డివిజన్ కో–ఆర్డినేటర్ వాండ్రాసి లక్ష్మి తొలుత బీజామృతం తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. 20 లీటర్ల నీటిలో 5 కిలోల ఆవుపేడ, మరో 5 లీటర్ల ఆవుమూత్రం, 50 గ్రాముల సున్నం, గుప్పెడు మట్టి కలిపితే బీజామృతం తయారవుతుందని, దీనిని పంటలకు వినియోగిస్తే మంచిదన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



సీఎం చిత్రపటానికి పుష్పాభిషేకం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు సరస్వతి

రామభద్రపురం: బడ్జెట్ కేటాయింపులో రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి అన్నారు. శుక్రవారం మండలంలోని కొట్టక్కి గ్రామంలో రైతులతో కలిసి ఆమె ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పుష్పాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాలకు అధిక నిధులు కేటాయించడంతో రైతుల ముఖాల్లో చిరునవ్వులు విరబూస్తున్నాయన్నారు. రైతును రాజుగా చూడాలన్న లక్ష్యంతోనే సీఎం జగనన్న పనిచేస్తున్నారన్నారు. మరోసారి ఆయన రైతు పక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పికొండ అనురాధ, ఎంపీటీసీ సభ్యురాలు కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- క్వాలిటీ కంట్రోల్ డీఈఈ లక్ష్మణరావు



కూనాయవలసలో ప్రభుత్వ భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ డీఈఈ లక్ష్మణరావు

తెర్లాం: గ్రామాల్లో జరుగుతున్న భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డీఈఈ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని కూనాయవలస, ఎస్.బూర్జవలస, వి.చిన్నయ్యపేట పంచాయతీల్లో నిర్మించిన భవన నిర్మాణ పనుల్లో నాణ్యతను శుక్రవారం పరిశీలించిన ఆయన కొన్నిచోట్ల జరుగుతున్న సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణాలు సంతృప్తికరంగానే ఉన్నాయని, మరికొన్నిచోట్ల పనుల్లో నాణ్యతా అంతగా కనబడడం లేదన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ జేఈ సుధాకర్, మండల ఇంజినీరింగ్ అధికారి ఆర్నిపల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లిస్తే.. వడ్డీ మాఫీ



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పన్ను బకాయిదారులకు ప్రభుత్వం ఊరట కల్పించిందని కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో వార్డు సచివాలయ అడ్మిన్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయా వార్డుల్లోని పన్ను బకాయిదారులు ఒకేసారి మొత్తం చెల్లించిన వారికి వడ్డీ మాఫీ అవుతుందని తెలియజేయాలని సూచించారు. ఈ నెలాఖరులోగా పన్ను మొత్తాన్ని చెల్లించిన వారికి మాత్రమే ఈ రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. ఇచ్చిన టార్గెట్‌లను శతశాతం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వినూత్నంగా బోధించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ

వంగర: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వినూత్నంగా బోధన చేయాలని ఎంఈఓ దుర్గారావు సూచించారు. మండలంలో వంగర, కొండ చాకరాపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధనపై ఆరాతీశారు. టీఎల్‌ఎమ్‌లను పరిశీలించారు. హెచ్‌ఎం గోవిందరావు, ఉపాధ్యాయులు శారద, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణ

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణ సాధ్యమని తెలగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చనమల్ల ప్రసాదరావు అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో 1915 నుంచి 1966 వరకు అమల్లో ఉన్న బీసీ రిజర్వేషన్లను ముఖ్యమంత్రి పునరుద్ధరిస్తారని ఆశిస్తున్నామన్నారు. హైకోర్టు బెంచ్ తీర్పు ప్రకారం బీసీ కమిషన్ నివేదికను పరిగణలోకి తీసుకోవాలన్నారు. మంజునాథ కమిషన్‌కు అనుగుణంగా కమిటీ సభ్యులు స్పందించాలన్నారు. త్వరలో పట్టణ తెలగ సంక్షేమ సంఘం సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు.

22 మంది గైర్హాజరు

బాడంగి: స్థానిక గురుకుల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శుక్రవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు సంబంధించి, గురుకుల కళాశాలలో ఆరుగురు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 16 మంది హాజరుకాలేదని పరీక్ష కేంద్రాల చీఫ్‌లు టి.రామదాసు, వి.శంకరరావు తెలిపారు.

నెలాఖరులోగా బకాయి పన్ను చెల్లించాలి

బొబ్బిలి: ఈ నెలాఖరులోగా బకాయి పన్ను చెల్లించిన వారికి వడ్డీ మాఫీ అవకాశం ప్రభుత్వం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాలకు సంబంధించి, పన్ను చెల్లించే యజమానులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం'

రాజాం సిటీ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తామంతా రుణపడి ఉంటామని 98 డీఎస్సీ క్వాలిఫై అభ్యర్థులు అన్నారు. 98 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల పోస్టింగ్‌పై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్.రాజగోపాలనాయుడు, సీహెచ్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ.. 24 ఏళ్లుగా ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న తమకు సీఎం జగన్ న్యాయం చేశారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమకు న్యాయం చేశారన్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



బాధితురాలికి రూ.10 వేల నగదు అందిస్తున్న సర్పంచ్ జగ్గారావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ పంచాయతీ, చాపరాయిజంగిడిభద్ర గ్రామానికి చెందిన వేమన్న ఈ నెల 15వ తేదీన మృతి చెందాడు. ఈ మేరకు ఆయన భార్య లక్ష్మికి వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలను సర్పంచ్ మండంగి జగ్గారావు శుక్రవారం అందజేశారు. మిగతా రూ.90 వేలు త్వరలోనే బాధితురాలి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు.

అర్హులందరికీ వైఎస్సార్ ఆసరా పథకం వర్తింపు



తెర్లాం సచివాలయంలో వైఎస్సార్ ఆసరా లబ్ధిదారుల జాబితా ప్రదర్శిస్తున్న ఏపీఎం రాము తదితరులు

తెర్లాం: మండలంలోని స్వయం సహాయక సంఘ(ఎస్‌హెచ్‌జీ)ల్లోని అర్హులైన సభ్యులందరికీ ప్రభుత్వం మంజూరు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం వర్తిస్తుందని మండల వెలుగు ఏపీఎం తామరాపల్లి రాము తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో అర్హుల జాబితాను శుక్రవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అర్హత ఉన్న ప్రతీ ఎస్‌హెచ్‌జీలోని సభ్యులకు రెండు విడతలుగా వైఎస్సార్ ఆసరా పథకం వర్తింపజేయడం జరిగిందన్నారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాల్లో అర్హుల జాబితా ప్రదర్శించడం జరిగిందని, పథకం వర్తించిందో, లేదో జాబితా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెర్లాం–1 సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ హరిబాబు, తెర్లాం–2 సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: వైఎస్సార్ ఆసరా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం పీపీ స్వామి కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమైన ఆయన వైఎస్సార్ ఆసరా పథకం అర్హుల జాబితాను సచివాలయాల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు. త్వరలో పథకం డబ్బులు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్షయవ్యాధి నివారణకు కృషి చేయాలి



తెర్లాం: క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న బాడంగి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ రమేష్

తెర్లాం: క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాడంగి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ బి.రమేష్, తెర్లాం పీహెచ్‌సీ సీహెచ్‌ఓ భాస్కరరావు కోరారు. శుక్రవారం మండలంలోని ఎం.ఆర్ అగ్రహారంలో సర్పంచ్ లొట్టి లక్ష్మి ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట జ్వరం, కఫంలో రక్తజీర వచ్చినా, ఆహారం తినడానికి ఇష్టంలేకపోయినా, బరువు తగ్గినా క్షయవ్యాధి కావచ్చని, అటువంటి లక్షణాలున్న వ్యక్తులు దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లి, తనిఖీ చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో క్షయ వ్యాధిగ్రస్తులు ఉంటే వారికి 6 నెలల పాటు పౌష్టికాహారం అందించేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాగమణి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ప్రభుత్వ భూముల గుర్తింపు



భూముల సరిహద్దుల గుర్తింపులో తహసీల్దారు రాజేశ్వరరావు

తెర్లాం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లోని ప్రభుత్వ భూములను పక్కాగా గుర్తించనున్నట్లు తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని జె.కొత్తవలస గ్రామంలో జరుగుతున్న సరిహద్దుల గుర్తింపు కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూముల సరిహద్దులు గుర్తించేటప్పుడు తప్పనిసరిగా రైతులను దగ్గర ఉంచి, భూముల సరిహద్దులు గుర్తించాలన్నారు. రికార్డులో ఉన్న ప్రకారం ప్రభుత్వ భూములకు సరిహద్దులు వేయాలని, సరిహద్దుల గుర్తింపులో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఆయన వెంట మండల సర్వేయర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 13,719 మందికి 'ఉపాధి'



రేగిడి: తునివాడలో వివరాలు సేకరిస్తున్న ఏపీఓ హరనాథరావు



రాజాం: ఆగూరు నీలచెరువులో పనులు పరిశీలిస్తున్న ఏపీఓ సాయిరాం

రేగిడి: మండలంలో 39 గ్రామ పంచాయతీల పరిధిలో 13,719 మందికి పనికల్పిస్తున్నామని ఏపీఓ ఎస్.హరనాథరావు తెలిపారు. తునివాడలోని చింతలవానిచెరువులో జరుగుతున్న ఉపాధి పనులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 16,776 మందికి జాబ్ కార్డులు అందించడం జరిగిందన్నారు. ఇంతవరకూ రూ.16.57 కోట్లు వేతనదారులకు చెల్లించినట్లు చెప్పారు. 2022–23 సంవత్సరానికి గానూ రూ.8.10 లక్షల పనిదినాలును కల్పించినట్లు వెల్లడించారు.

రెండుపూటలా పనిచేయాలి

రాజాం: ఉపాధి వేతనదారులు రెండుపూటలా పనిచేస్తే కనీస వేతనం వస్తుందని ఏపీఓ సాయిరాం సూచించారు. మండలంలో ఆగూరు, కంచరాం తదితర గ్రామాల్లో ఉపాధిపనులను శుక్రవారం పరిశీలించారు. ఆగూరులో నీలచెరువు వద్ద జరుగుతున్న పనుల్లో పాల్గొన్న వేతనదారుల మస్తర్లు పరిశీలించారు.

పలుచోట్ల నేలకొరిగిన పంటలు



రాజాం: బొమ్మినాయుడువలస సమీపంలో నేలకొరిగిన మొక్కజొన్న



సంతకవిటి: శేషాద్రిపురం వద్ద నేలకొరిగిన నువ్వు పంట

రాజాం: మండలంలో బొమ్మినాయుడువలస పంచాయతీ పరిధిలో రబీలో రైతులు సాగుచేస్తున్న మొక్కజొన్న పంట అకాలవర్షానికి నేలకొరిగింది. సుమారు 40 ఎకరాల్లో మొక్కజొన్న పంటనష్టం జరిగినట్లు సర్పంచ్ వంజరాపు అన్నపూర్ణమ్మ శుక్రవారం తెలిపారు. 30 మంది రైతులకు సంబంధించిన పంట నేలకొరిగిందని, వ్యవసాయశాఖ అధికారులు పంటనష్టాలను పరిశీలించి, రైతులకు పరిహారం అందించాలని కోరారు.

సంతకవిటి: అకాల వర్షాలు కారణంగా మండలంలో పలుచోట్ల నువ్వు, రాగి పంటలు నేలకొరిగాయి. శేషాద్రిపురం, సిరిపురం, మండాకురిటి తదితర ప్రాంతాల్లో అధికంగా పంట నష్టం జరిగినట్లు రైతులు చెపుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు పంటనష్టాలను పరిశీలించి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనులు

రాజాం: పట్టణంలో ఏదైనా వార్డులో మురుగుకాలువలు అపరిశుభ్రంగా ఉంటే వెంటనే ఫిర్యాదుచేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ పట్టణ ప్రజలకు సూచించారు. పట్టణంలో శ్రీనివాసరోడ్డు, రాణావీధుల్లో మురుగుకాలువల్లో పేరుకుపోయిన పూడికలను శుక్రవారం తొలగించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు.

రాణావీధిలో కాలువలు శుభ్రం చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్



మధ్యాహ్న భోజనం పరిశీలన



ఉంగరాడ పాఠశాలలో మధ్యాహ్న భోజనాలు పరిశీలిస్తున్న ఎంఈఓ

రేగిడి: పాఠశాలల్లో అమలుచేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం చక్కగా ఉండాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు అన్నారు. మండలంలో ఉంగరాడ, అంబఖండి తదితర పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. భోజనాలు బాగుంటున్నాయా? మెనూ ప్రకారం వండిపెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారంలో ఒకరోజు విద్యార్థుల తల్లిదండ్రులు ఇక్కడ భోజనం చేయాలని అన్నారు.